క్లుప్తంగా

తహసీల్దార్ శంకరరావు బాధ్యతల స్వీకరణ

కంచికచర్ల: కంచికచర్ల తహసీల్దార్‌గా పి.శంకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన వడ్డేశ్వరపు రాజకుమారి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. శంకరరావు రాష్ట్ర సచివాలయంలో పనిచేసి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నెలకొన్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా రైతాంగం సమస్యలుంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని శంకరరావు తెలిపారు.

మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



నందిగామ: రాష్ట్రంలో మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఏసీపీ నాగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహిళల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న ఏసీపీని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సత్కరించారు. నందిగామ ప్రాంతంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. నిర్వాహకులు కె.సజ్జనరావు, పి.శేఖర్‌రావు, మహిళా ఎస్‌ఐ రమణ, అతిథులు పాల్గొన్నారు.

ఎర్రకాలువలో పూడికతీత పనులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఎర్రకాలువలో పూడిక తీత పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు. గురువారం పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎర్రకాలువలో మురుగు ఉన్నందున పరిసర ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు అనారోగ్యంతో బాధ పడుతున్నారని శ్రీసంధాని, టైమ్స్ ఆఫ్ ఇండియా వారు ఇచ్చిన ఫిర్యాదును అనుసరించి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రవాహానికి అడ్డుపడుతున్న వ్యర్థాలను తొలగించడం, దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేయింగ్ చేయించడం, ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామన్నారు. పూడిక తొలగించేందుకు టెండర్స్‌ను పిలిచి తొలగింపు పనిని చేపట్టామన్నారు. గుర్రపు డెక్కను తొలగిస్తున్నట్లు తెలిపారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

కంచికచర్ల: బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు కృష్ణా జిల్లా కోడూరు మండలం మందపాకల గ్రామానికి చెందిన మధురిషిత కంచికచర్లలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. బుధవారం కళాశాలకు వెళ్లి సాయంత్రం సమయంలో తనకు మెడ నొప్పి వస్తుందని భవానీపురం ఆస్పత్రికి వెళ్తానని హాస్టల్ వార్డెన్‌కు చెప్పి వెళ్లిపోయింది. అయితే ఆ విద్యార్థి తల్లి సాయంత్రం సమయంలో ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. దీంతో కంగారుపడిన తల్లి రెడ్డమ్మ కాలేజీకి వచ్చి విచారించింది. అనంతరం తమ బిడ్డ కనిపించటం లేదని కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా ఇళ్ల మంజూరు

- ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

చౌటపల్లి(వీరులపాడు): అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ఇల్లు, ఇళ్ల స్థలం మంజూరు చేయించి, దశాబ్దాల నాటి సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు రకాల సంక్షేమ పథకాలను రూపొందించారన్నారు. ఎటువంటి పక్షపాత వైఖరికి, రాజకీయ, కులమతాలకు తావు లేకుండా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాల మాదిరిగా హామీలివ్వటం విస్మరించటం కాకుండా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నామని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల మహిళలకు సైతం సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించారని తెలిపారు. అన్ని రకాలుగా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు.



చౌటపల్లిలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

ఇళ్లు మంజూరు చేయాలి..

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావుకు ప్రజలు పలు సమస్యలను వివరించారు. గ్రామానికి చెందిన గరికపాటి అన్నమ్మ, పాదిలి గాంధీ, పాదిలి రామారావులు తమకు నివేశన స్థలం ఉందని ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

దీంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు హౌసింగ్ ఏఈ సాయిబాబును పిలిపించి వారికి తక్షణమే ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ పల్లెపోగు పుల్లయ్య, ఉప సర్పంచ్ కోట సంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పల్లెపోగు మార్తమ్మ, సొసైటీ చైర్మన్ కోట రామారావు, పార్టీ మండల రైతు కన్వీనర్ సాయిబాబు, సర్పంచ్ చలమల దుర్గారావు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్..

నందిగామటౌన్: నేనున్నానని మాటివ్వటమే కాదని సంక్షేమ పథకాలు అందించి పేదలకు అండగా నిలుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో గురువారం రాత్రి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చావల రవిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, కందుల బుచ్చిరామయ్య, జంపాని నాగేశ్వరరావు, వేగినీడి సుబ్బారావు, శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కొడవటికల్లులో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

ఘనంగా వెంకటాద్రి నాయుడు జయంతి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): తెలుగు రాష్ట్రాల్లో 584 శివాలయాలు నిర్మించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 227వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను నేతలు కొనియాడారు. కార్యక్రమంలో శ్రీఅయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వాసిరెడ్డి బెనర్జీ, శ్రీతిరుపతమ్మవారి ఆలయ ధర్మకర్త కోలా రామారావు, ఆలయ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు, గ్రామ నాయకులు వూట్ల లక్ష్మయ్య, గింజుపల్లి శ్రీనివాసరావు, కొత్తపల్లి పెంటయ్య, కంచేటి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

కంచికచర్ల: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ కె.బాల శంకరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ.. నందిగామ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపీస్ట్‌పై ఉచితంగా శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల యువత తమ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు.

కోహన్స్ సేవలు స్ఫూర్తిదాయకం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- ప్రభుత్వాస్పత్రికి రూ.34 లక్షల విలువైన వైద్య పరికరాల అందజేత

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ సమీపంలో ఉన్న ఫార్మా కంపెనీ కోహన్స్ సేవలు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో కనెక్ట్ టు ఆంధ్రా ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా కోహన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ వారి సహకారంతో అందజేసిన రూ.34 లక్షల విలువైన వైద్య పరికరాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఉదయభాను, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పేట నియోజకవర్గ అభివృద్ధిలో కోహన్స్ వారు కూడా భాగస్వాములు అవడం హర్షణీయమన్నారు. ఇదే ఆస్పత్రికి గతంలో కోహన్స్ కంపెనీ వారు రూ. కోటితో జిల్లాలో ఎక్కడా లేని విధంగా కిడ్నీ రోగుల కోసం కొత్త డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేశారని చెప్పారు. పి 10 అల్ట్రా సౌండ్ సిస్టం, మొబైల్ ఎక్స్‌రే మిషన్, అనెస్తీషియా స్టేషన్, 2 ఈసీజీ మెషన్లు తదితర రూ.34 లక్షల విలువైన పరికరాలు అందజేశారు. ఇదే ఆస్పత్రికి సీఎస్సార్ నిధుల నుంచి మరొక రూ.20 లక్షలు కేటాయించి మార్చురీ రూమ్ ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే కోహన్స్ కంపెనీ వారిని కోరారు.



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను, వెంకటకృష్ణ ప్రసాద్, కోహన్స్ ఫార్మా అధికారులు

వైద్యం, విద్య రంగాల్లో చారిత్రక మార్పులు..

దేశంలో ఏ రాష్ట్రంలో, ఎన్నడూ లేని విధంగా ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్య రంగాల్లో పెను మార్పులు చేసి వాటికి పెద్ద పీట వేసి చరిత్ర సృష్టించారని ప్రభుత్వ విప్ ఉదయభాను అన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి సీట్ల కోసం ఎదురుచూసేలా చేశారని చెప్పారు. అలాగే కార్పొరేట్ వైద్య సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చి సామాన్యులకు అందజేస్తున్నారన్నారు. పేట ప్రభుత్వాస్పత్రిలో రూ.3 కోట్ల నాబార్డు నిధులతో అభివృద్ధి చేస్తున్నారని, 30 పడకల నుంచి 50 పడకలకు పెంచామని తెలిపారు. నాడు ఇద్దరే వైద్యులు ఉండగా, నేడు ఏడుగురిని నియమించామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కనెక్ట్ టు ఆంధ్ర సీఈవో కోట్ల శివశంకరరావు, కోహన్స్ వైస్ ప్రెసిడెంట్ బాబుప్రసాద్, ప్రతినిధులు రాజారావు, రవికుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆళ్ల హరీష్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, ఖాదర్‌బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, అక్బర్‌ఖాన్, తుమ్మల నాగమణి, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు షేక్ మొహిద్దీన్, చారుగుండ్ల కొండ, కన్నమాల శామ్యూల్, నాయకులు ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, ఎక్బెడ్ బాషా, ఎస్ఎస్‌పీ సైదా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

జగ్గయ్యపేట: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు, కౌన్సిల్ సభ్యుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనా ఏపీ మత్స్య శాఖ ప్రోత్సాహంతో పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల గ్రామానికి చెందిన ఇండ్ల సురేష్‌కు మంజూరైన వాహనాన్ని గురువారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఫిష్ ఆంధ్ర పేరుతో రాష్ట్రంలోనే ప్రత్యేక హబ్‌లు ఏర్పాటు చేస్తూ ఇంటి వద్దకే మత్స్య సంపదను పంపేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కెడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ జక్కులూరి రాంబాబు, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శ్యాంలెనిన్‌బాబు, ఎఫ్ఎం రంగారావు, వీఎఫ్ఏ గోపీనాథ్, రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు బేరోతు నాగమణి, నాయకులు జయరాం, వడ్డీకాసులు, శివ, చక్రి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వాహనాన్ని అందజేస్తున్న వెంకట కృష్ణప్రసాద్

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



జగ్గయ్యపేటఅర్బన్: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని రేషన్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు యు.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి శివ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ సూచన మేరకు జిల్లాల వారీగా నిర్వహిస్తున్న మండల కమిటీల సమావేశంలో భాగంగా గురువారం స్థానిక వీఆర్వోల భవన్‌లో పేట మండల రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రేషన్ డీలర్ వద్ద నుంచి కార్డుదారులకు పంపిణీ చేయడానికి సరుకు తీసుకువెళుతున్న ఎండీయూ ఆపరేటర్లలో చాలా మంది డీలర్లకు నగదు చెల్లించే విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. వారి నుంచి డబ్బులు రాక, తరువాత నెలకు డీడీలు చెల్లించలేక డీలర్లు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పలువులు డీలర్లు నాయకుల దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు సరుకు రవాణా చేసే సమయంలో ప్రతి నెల షెడ్యూల్ ప్రకారం పంపించేలా చూడాలని కోరారు. నందిగామ డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు, డీలర్లు ఉన్నారు.

భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్

కంచికచర్ల: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ల్యాండ్ ఆఫ్ సర్వే, రెవెన్యూ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు జేసీ మాట్లాడుతూ, జిల్లాలో 14 గ్రామాల్లో ఇప్పటికే రీ సర్వే పనులు పూర్తిచేసి సర్వే హద్దు రాళ్లకు ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొన్ని గ్రామాల్లో సర్వే హద్దు రాళ్లను పాతే క్రమం 98 శాతం పూర్తయిందన్నారు. పరిటాల గ్రామంలో జరిగిన రీ సర్వేపై పూర్తిస్థాయిలో రికార్డుల ప్రకారం విచారణ చేపట్టాలన్నారు. కంచికచర్ల మండలంలో రెవెన్యూ గ్రామాలైన పేరకలపాడు, పెండ్యాల, గండేపల్లి, కీసర, సైదాపురం గ్రామాల్లో భూముల రీ సర్వే పనులు సిబ్బంది చేపట్టారన్నారు. రీ సర్వే వల్ల కచ్చితమైన హద్దులు, కొలతలు వస్తాయన్నారు. సమావేశంలో కమిషనర్ ఆఫ్ సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ సిద్ధార్థజైన్, నందిగామ ఆర్డీవో ఏ.రవీంద్రరావు, రీజినల్ డెప్యూటీ డైరెక్టర్(కాకినాడ) కెజియా, జిల్లా అసిస్టెంట్ సర్వేయర్ సూర్యారావు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి ఉదయభాస్కర్, నందిగామ డివిజనల్ సర్వే అధికారి ఎస్ రవీంద్రప్రసాద్, తహసీల్దార్ శంకరబాబు, డెప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరా, మండల సర్వేయర్ జే.బసవరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చాదర్ సమర్పించిన ఎమ్మెల్యే

నందిగామ టౌన్: హజరత్ బందగీమియా సయ్యద్ దర్గా ఉరుసు ఉత్సవాలను ముస్లింలు ఐక్యంగా నిర్వహించుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో జరుగుతున్న ఉరుసు ఉత్సవాల్లో గురువారం ఆయన పాల్గొని చాదర్ సమర్పించారు. ముందుగా ఉరుసు ఉత్సవాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు ముస్లింలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో కంచికచర్ల ఎంపీపీ మలక్ బషీర్, నాయకులు చాంద్ బహదూర్, గౌస్‌బాషా, ఎంఎఫ్, సిద్దిక్, నస్రత్, కరిముల్లా, నిసార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి

నందిగామ: ప్రతి ఇంటి వద్దకు మున్సిపల్ సిబ్బంది వచ్చిన సమయంలో తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు బహుళ అంతస్తుల భవనాల్లో చెత్త సేకరణకు సంబంధించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి, చెత్త వేరువేరు డబ్బాల్లో మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. ముఖ్యంగా ఖాళీ స్థలాల నిర్వాహకులు వారి స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శుభ్రంగా లేని ఖాళీ స్థలాల నిర్వహకులకు నోటీసులు జారీ చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

ప్రజల సమస్యల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరించాలి

నందిగామ: సచివాలయ ఉద్యోగులు ప్రజల సమస్యల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ఆదేశించారు. పట్టణంలోని 2, 4వ సచివాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ఇందులో భాగంగా సచివాలయానికి వచ్చిన వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలోని రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నందిగామటౌన్: చదువుతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన డీవీఆర్ కళాశాలకు చెందిన విద్యార్థినులను స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించటం గర్వనీయమన్నారు. ప్రతి నిరుపేద ఉన్నత చదువులు చదవాలనే సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫీజురీయింబర్స్ మెంట్, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, తదితర పథకాలను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థినులు రాచబంటి రేణుక, గాయత్రి, భార్గవిలతో పాటు అధ్యాపకులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల గౌరవాధ్యక్షుడు ఆళ్ల రాంబాబు, ప్రిన్సిపాల్ శిరివెళ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలను చేపట్టిందని విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను అన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో విశ్వభారతి–శ్రీలక్ష్మి జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో టౌన్ ఫస్ట్ సాధించిన విద్యార్థులను విమలాభాను అభినందించారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్ ఫలితాల్లో టాపర్లు జూనియర్ ఇంటర్ బైపీసీలో మహ్మద్ హిబా అఫాఫ్(435)ను, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సాల్మన్‌రాజు(987), జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.నిత్యశ్రీ(464)లను అభినందించారు. వీరిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు కె.పద్మశేఖర్, కె.కిషోర్‌కుమార్, జి.నారాయణరావు, టి.సత్యనారాయణ అభినందించారు. వాగ్దేవి మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ ఎంపీసీ లో కె.అనిత(982), బైపీసీలో పవిత్ర(966), సీఈసీలో గాయత్రి(950) మార్కులు సాధించి టౌన్ టాపర్స్‌గా నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో షెహనాజ్(460), బైపీసీలో బాలు భార్గవి(426), సీఈసీలో నాగసుప్రియ(482) మార్కులతో టౌన్ టాపర్స్‌గా నిలిచారు. ప్రిన్సిపాల్ సురేష్, కరస్పాండెంట్ సరిత వారిని అభినందించారు.

విప్ ఉదయభాను అభినందనలు..

బాలికల గురుకులంలో విద్యార్థులు 89 శాతం ఉత్తీర్ణత, మంచి మార్కులు సాధించడం పట్ల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా ఉత్తీర్ణతతో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ విద్యార్థులను, ప్రిన్సిపాల్, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

శ్రీ అక్షర కళాశాల విద్యార్థుల విజయ దుందుభి

కంచికచర్ల: కంచికచర్ల శ్రీ అక్షర డిగ్రీ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. వై.వెంకటసాయి, జి.శ్రీరామ్ ఎంపీసీలో 464 మార్కులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు గురువారం తెలిపారు. బైపీసీలో ఆర్.నవ్యశ్రీ 431 మార్కులు సాధించారని అన్నారు. విద్యార్థులను అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం అభినందించారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను

గురుకులంలో 89 శాతం ఉత్తీర్ణత

జగ్గయ్యపేటఅర్బన్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఉషారాణి గురువారం తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 65 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 58మంది(89 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. సెకండియర్‌లో 65 మందికి గాను 56 మంది(86 శాతం) పాసైయ్యారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీలో కె.ఉదయశ్రీ 953 మార్కులు, సీఈసీలో ఆర్.వెంకాయమ్మ(890), జూనియర్ ఇంటర్ ఎంఈసీలో వై.జయశ్రీ(478), సీఈసీలో అక్షిత(461) మార్కులు సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ కొండపల్లి లక్ష్మీ సుజాత, అధ్యాపక బృందం అభినందించారు.

ఉక్కు కళావేదిక అద్దె వసూలుకు వేలం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న ఉక్కు కళావేదికలో జరుగు కార్యక్రమాలకు అద్దె వసూలు హక్కు కోసం గురువారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో ఆరుగురు పాటదారులు పాల్గొనగా, వారిలో గన్నవరపు వెంకట నాగ పుల్లారావు అనే వ్యక్తి రూ.22,53,000 లకు వేలం పాడి హక్కు దక్కించుకున్నాడు. సదరు పాటదారునికి కౌన్సిల్ వారి ఆమోదం పొందిన తరువాత మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తామని కమిషనర్ తెలిపారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న పాటదారులు